# బయ్యారం రాంరెడ్డి అమరుడు

అణచివేతకు గురయ్యే వాళ్లకు తమ గోడు చెప్పుకోవడానికీ సహాయం పొందడానికీ ఒక 'దిక్కు' అవసరం. తామే సంఘటితమై పోరాటం చేయగలిగినా ఏదో ఒక దశలో అటువంటి 'దిక్కు' అవసరమవుతుందిగానీ పోరాటం చేసే స్థితిలో లేనివారికి అదే ముఖ్యమైన ఆధారం అవుతుంది.

హక్కుల ఉద్యమానికి ఎంత పెద్ద నిర్వచనమయినా ఇచ్చుకోని గాక, అది చేసే ముఖ్యమైన పనులలో ఇదొకటి. ఆ విషయాన్ని అర్థం చేసుకున్న హక్కుల సంఘాలకు, కార్యకర్తలకు ప్రజలలో ఉన్న ఆదరణ హక్కుల ఉద్యమ సిద్ధాంతకర్తలకుగానీ ఉగ్రూతలూగించే ఉపన్యాసకులకుగానీ ఉండదు.

బయ్యారం రాంరెడ్డి అటువంటి కార్యకర్త. సిద్ధాంత సంవాదాలలో అతను చురుకుగా ఎప్పుడూ పాల్గొనలేదు. గొప్ప ఉపన్యాసకుడు కాడు. కానీ 'నాకు అన్యాయం జరిగింది' అంటూ తన దగ్గరకు వచ్చిన వారి కష్టాలను తన భుజానికెత్తుకుని వారికి ఎంతో కొంత ఉపశమనం కలిగించడం కోసం అహర్నిశలు కృషి చేయడంలో మాత్రం రాంరెడ్డి తరువాతే వేరే ఎవరినైనా చెప్పుకోవాలి.

అందుకే అప్రస్తుతమైన కారణాల వల్ల ప్రజలకు తాను చేయగల సహాయానికి ఆటంకం ఏర్పడితే రాంరెడ్డికి అసహనంగా ఉండేది. ఆ కారణాలను చూపి కార్యక్రమాలకు అడ్డం పెట్టే వారంటేనూ అసహనంగా ఉండేది.

బయ్యారం రాంరెడ్డి చనిపోయి ఈ ఆగస్ట్ 17వ తేదీకి ఒక సంవత్సరం గడిచింది. రాంరెడ్డి బతికి ఉంటే ఈ సంవత్సర కాలంలో మెదక్ జిల్లాలో ఇంకా అనేక సమస్యలు వెలుగుచూసి ఉండేవనీ అనేక విషయాలలో ఇంకొంచెం ఎక్కువ ఆందోళన జరిగి ఉండేదనీ చెప్పడానికి సందేహించనక్కరలేదు.

ఒక రాంరెడ్డి పోతే వందమంది రాంరెడ్డిలు వస్తారని చెప్పగల స్థితిలో మనం ఉండి ఉంటే రాంరెడ్డి గురించి ఆవేదన చెందినా రాంరెడ్డిలేని లోటు గురించి మరీ ఇంతగా ఆవేదన చెందకపోదుమేమో. కానీ ఆ స్థితిలో మనమీ రోజు లేము. ఉద్యమాలలోకి పోతే ఏమొస్తుంది? అని లెక్కలు తీసే రోజులొచ్చాయి. ఏదైనా వస్తేనే పోదామనుకునే రోజులు వచ్చాయి. సంపాదించుకుని బయటపడే రోజులూ వచ్చాయి.

సమాజంలోనూ రాజ్యాంగ యంత్రంలోనూ ప్రజాస్వామ్య విలువలనూ హక్కులనూ పెంపొందించడం కోసం హక్కుల ఉద్యమం ఉనికిలోకి వచ్చింది. ఈ హక్కులకూ విలువలకూ స్వాతంత్ర్యానంతరం నలభై ఏళ్ల పాటు కొంత గౌరవమైనా ఉండింది. పూర్తిగా అమలు చేయకున్నా,

సమగ్రంగా ఆచరించకున్నా 'అవును అవి గొప్ప విలువలే' అని ఒప్పుకోక తప్పని వాతావరణం ఉండింది.

ఒక దశాబ్దకాలంగా ఈ వాతావరణం వేగంగా మారిపోతున్నది. ప్రజాస్వామ్యము, హక్కులు, ఇవేవీ కాదు. 'అభివృద్ధి' ముఖ్యం అనే వైఖరి ప్రబలింది. కేవలం ప్రభుత్వంలోనూ పాలక పార్టీలలోనూ కాదు, సమాజంలోనూ ప్రబలింది. ఈ అభివృద్ధి మనుషుల అభివృద్ధి కాదు. భౌతిక వనరుల అభివృద్ధి. వాటితో పాటు వాటిని తమ అదుపులో పెట్టుకున్నవారు కూడా అభివృద్ధి చెందుతారు. ఏ వనరులూ అందుబాటులో లేనివారికి ఈ అభివృద్ధిలో భాగం ఉండదు. ఇతరుల అభివృద్ధి నుండి రెండు చుక్కలు అభ్యర్థించి పొందాలి. లేదా దొంగిలించి బతకాలి. అది పగటి దొంగతనం కావచ్చు, రాత్రి దొంగతనం కావొచ్చు.

ఈ అభివృద్ధి ప్రజలకిచ్చే సందేశం ఏమిటంటే పక్కవాళ్ల కడుపు కొట్టయినా ఏవో కొన్ని వనరులపైన అధికారం పొందు. లేదా వనరులున్న వాళ్ల పంచన చేరి వాటి ఫలంలో కొంత వాటా పొందు. అంతే తప్ప ఒకరి కోసం అందరూ, అందరి కోసం ప్రతి ఒక్కరూ నిలబడే సంఘటిత హక్కుల దృక్పథానికిక్కడ చోటు లేదు.

బాధకరమైన విషయమేమిటంటే ఈ అభివృద్ధి పంథా హక్కుల లేమిని ఎంతగా పెంచుతుందో ఆ లేమికి వ్యతిరేకంగా సూత్రబద్ధంగానూ సంఘటితంగానూ నిలబడే సంకల్పాన్ని అంతగా తగ్గిస్తుంది. హక్కుల కోసం నిలబడే అవసరాన్ని పెంచుతుంది. దానికి కావలసిన వైఖరిని క్షీణింపజేస్తుంది.

ఈ పరిస్థితులలో రాంరెడ్డి వంటి వ్యక్తులు ఒకరు పోతే వందమంది రారు. ఒకరి స్థానంలో ఒకరినైనా పొందడం ప్రయత్నపూర్వకంగానే సాధ్యం అవుతుంది. అందువల్ల వ్యక్తిగా రాంరెడ్డి లోటే కాదు, ఉద్యమకారుడిగా అతని లోటు తీరడం కూడా దానంతటది జరిగేది కాదు.

అయినప్పటికీ రాంరెడ్డి మృతితో మెదక్ జిల్లాలో హక్కుల సంఘాలుగానీ హక్కుల ఉద్యమంగానీ పూర్తిగా కుంటుపడలేదు. రాంరెడ్డి ముందుకొచ్చి హక్కుల ఉద్యమ నిర్మాణ బాధ్యతను మీద వేసుకునేదాకా ఈ జిల్లాలో ప్రజాపోరాటాలూ ఉద్యమాలూ అనేకం ఉన్నా హక్కుల ఉద్యమ నిర్మాణం లేదు. కానీ అతని మరణం తరువాత అదే శూన్యం తిరిగి ఏర్పడలేదు.

అయితే రాంరెడ్డి మొదలుపెట్టి అర్థాంతరంగా వదిలిపెట్టి వెళ్లిన నిర్మాణాన్ని నిలబెట్టుకోవడమే కాదు, బలోపేతం చేసుకోవడం చాలా అవసరం. అరెస్టుకూ ప్రాణం పోవడానికీ కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉండే చోట అందుబాట్లో హక్కుల ఉద్యమకారుల ఉనికి చావును బతుకుగా మార్చగలదు. సాంఘిక అణచివేతను ప్రశ్నించడం దుస్సాహసంగా కనిపించే చోట అందుబాట్లో హక్కుల ఉద్యమకారుల ఉనికి అది వట్టి

భయమని తెలియజెప్పగలదు. తిరగబడే వాళ్లు ఒంటరి చావు చస్తారన్న తత్వం తలకెక్కిన చోట అందుబాట్లో హక్కుల ఉద్యమకారుల ఉనికి అది అబద్ధమని నేర్పించగలదు.

హక్కుల ఉద్యమకారులందరూ అంతటి పాత్ర పోషించలేకపోవచ్చు. కానీ రాంరెడ్డి వంటి వారికది చేతనయ్యింది.

అందుకే మరికొంతమంది రాంరెడ్లను తయారు చేసుకోవడం కోసం బయ్యారం రాంరెడ్డిని గుర్తు చేసుకుందాం.

20.08.2000, మెదక్